

హైదరాబాద్ వార్త

# పరవశింపజేసిన పంచతంత్ర కథల నృత్యరూపకం



రవీంద్రభారతి, జులై 4 (ప్రభాతవార్త) : వందలయేళ్లనాటి పంచతంత్ర కథల జ్ఞానం నృత్యమై కదలిరాగా, అభినయమే భాషగా, హాస్య చమత్కారాలే హంగులుగా పరవళ్లుతొక్కగా పంచతంత్ర కథలు జాతీయ కళామందిరం రవీంద్రభారతి వేదికపై హాజరైన అశేష ప్రేక్షక సందోహాన్ని పరవశింపజేసింది. హైదరాబాద్, బెంగళూరు నగరాలకు చెందిన 20మంది కళాకారులు ఈ ప్రదర్శనను నృత్యవిన్యాసాలతో రక్తికట్టించారు. హాస్యం, చమత్కారం, భావోద్వేగం, అద్భుతమైన దృశ్యాలతో కథా సంప్రదాయాలను గొప్పదనాన్ని చాటిచెబుతూ మంత్రముగ్ధులను చేశాయి. ప్రఖ్యాత నృత్యకారిణి, నాట్యగురు పద్మశ్రీ డా. ఆనందశంకర్ జయంత్ అద్భుత కొరియోగ్రఫీ, దర్శకత్వంలో శంకరానంద కళాక్షేత్ర సమర్పణలో ఈ నృత్యరూపకం అబ్బురపరిచింది. భారతీయ సాంస్కృతిక మంత్రిత్వశాఖకు చెందిన జాతీయస్థాయిలో ప్రాధాన్యతను పొందిన సాంస్కృతిక సంస్థలకు అందించే సహాయంలో భాగంగా ఈ కార్యక్రమానికి ప్రాముఖ్యత సంతరించుకోవడం విశేషం. ఈ నృత్యరూపకం స్నేహం, శౌర్యం, సమయస్ఫూర్తి, మూర్ఖత్వం, నాయకత్వ లక్షణాలు, స్వార్థ వంటి విలువలు వివరిస్తూ అడవికి రాజైనా బలమైన సింహాన్ని తన తెలివితో ఓడించిన కుందేలు కథ, చెక్కదుంగ మధ్యలో ఉన్న మేకునులాగి తోకను ఇరికించుకున్న మూర్ఖపు కోతి కథ, కొంగలు తాబేలు కథ, దుష్ట మొసలి తెలివైన కోతి కథ, కిరాతకుడి వల నుండి తప్పించుకున్న పావురాల పంచతంత్రంలోని ప్రసిద్ధ కథలకు నృత్యరూపాలలో ప్రాణంపోస్తూ హాస్యం, చమత్కారాలతో పంచతంత్రం నుండి ఐదు కథలు కళ్లకుకట్టినట్లు అత్యంత అద్భుగా ప్రదర్శించారు.

# ఆహార కల్తీపై హెచ్-ఫాస్ట్ ఉక్కుపాదం!



**-100 రోజులు..185 కేసులు..121 టన్నుల కల్తీ ఆహారం స్వాధీనం -ఆహారం కల్తీ చేస్తే పీడీ యాక్ట్ పెడతాం : సీపీ సజ్జనార్ వార్నింగ్**



హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త

తినే అన్నంలో కల్తీలు..తాగే పాలలో రసాయనాలు..చివరకు పసిబిడ్డలకు పట్టే పాల పొడిలోనూ ప్రాణాంతక పదార్థాలు.. కేవలం లాభార్జనే పరమావధిగా సాగుతున్న నిశ్శబ్ద ముప్పుపై హైదరాబాద్ సిటీ పోలీస్ ఉక్కుపాదం మోపుతోంది. ప్రజారోగ్యాన్ని నిలువునా దెబ్బతీస్తూ నగరవాసుల ఆయుష్షను హరిస్తున్న కల్తీ ముఠాల ఆటకట్టించేందుకు రంగంలోకి దిగిన హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్-ఫాస్ట్) ఏర్పాటై 100 రోజులను పూర్తి చేసుకుంది. మార్చి 19వ తేదీన ఏర్పాటైన హెచ్-ఫాస్ట్ టీమ్.. జీహెచ్ఎంసీ,ఎంఎంసి, సిఎంసి, ఫుడ్ సేఫ్టీ, వెటర్నరీ విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే 100 రోజుల్లో నగరవ్యాప్తంగా వివిధ జోన్ల పరిధిలో మొత్తం 185 కేసులు నమోదు చేసింది. సుమారు 121.87 టన్నుల ప్రమాదకరమైన కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుంది. జోన్ల వారీగా పరిశీలిస్తే అత్యధికంగా రాజేంద్రనగర్ జోన్‌లో 55 కేసులు నమోదు కాగా, గోల్కొండ జోన్‌లో 44, సికింద్రాబాద్ జోన్‌లో 35, చార్మినార్ జోన్‌లో 21, శంషాబాద్ జోన్‌లో 13, జూబ్లీహిల్స్ జోన్‌లో 12, ఖైరతాబాద్ జోన్‌లో 5 కేసులు నమోదయ్యాయి.

నిత్యం వాడే కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌కు సంబంధించి 27 కేసుల్లో ఏకంగా 27,024.7 కేజీల నకిలీ నిల్వలను పోలీసులు పట్టుకున్నారు. కృత్రిమ రసాయనాలతో పండ్లను మగ్గబెట్టే 16 ముఠాల గుట్టురట్టు చేసి 25,845 కేజీల పండ్లను సీజ్ చేశారు. చికెన్ వ్యర్థాల విక్రయాలకు సంబంధించిన 6 కేసుల్లో ఏకంగా 60 టన్నుల కంటే ఎక్కువ చికెన్‌ను స్వాధీనం చేసుకోవడం గమనార్హం. వీటితో పాటు 3 కేసుల్లో 9,260 కేజీల నిల్వ పచ్చళ్లు, 4 కేసుల్లో 4,030 కేజీల కల్తీ కోవా, 7 కేసుల్లో 3,897 కేజీల నకిలీ టీ పొడి, సుమారు 15 టన్నుల నాణ్యత లేని చికెన్, మాంసం (12 కేసులు), 3,260 కేజీల కల్తీ క్రీమ్, 530 కేజీల కల్తీ నెయ్యి (1 కేసు), సుమారు 2,706 కేజీల నాణ్యత లేని డ్రై ఫ్రూట్స్,ఖర్జూరం (2 కేసులు), 2,500 కేజీల కల్తీ పెరుగు (1 కేసు), 1,514 కేజీల కల్తీ పనీర్ (5 కేసులు), ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో 120 కేజీల నాణ్యత లేని ఫ్రైడ్ చికెన్ (2 కేసులు) స్వాధీనం చేసుకున్నారు. ఐస్ క్రీములు, బిస్కెట్లు, ఆర్ఓ వాటర్ ప్లాంట్లు, జంక్ ఫుడ్స్ వంటి ఇతర విభాగాల్లో 34 కేసులు నమోదయ్యాయి.

**మరో 247 కేసులు జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగానికి బదిలీ**

పోలీసు చర్యలతో పాటు జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్ (ఎఫ్ఎస్ఓ)లకు తదుపరి చర్యల నిమిత్తం 247 కేసులు అప్పగించారు. ఇందులో అత్యధికంగా పనీర్ అవుట్‌లెట్లపై 70 కేసులు, ప్రజల నుంచి నేరుగా వచ్చిన ఫిర్యాదులపై 90 కేసులు నమోదు చేశారు. అలాగే సమోసా తయారీ కేంద్రాలపై 11, వాటర్ ప్యాకింగ్ ప్లాంట్లపై 9, మసాలాలు/స్పైసెస్ పై 7, బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలపై చెరో 6 కేసులు, జెప్టోపై 5, హాస్టళ్లు, మాంసం దుకాణాలపై చెరో 4 కేసులు, ఐస్ తయారీ కేంద్రాలపై 3, చికెన్ వేస్ట్/సీ ఫుడ్‌పై 3 కేసులు దాఖలయ్యాయి.

## పీడీ యాక్ట్ ప్రయోగించడానికి కూడా వెనుకాడం: సజ్జనార్



సమాజం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు ఆహార కల్తీ అని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ప్రజల కిడ్నీలను పాడుచేస్తూ, క్యాన్సర్, గుండె జబ్బుల వంటి తీవ్రమైన వ్యాధులను పంచుతూ సామాన్యుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజల ఆరోగ్యంతో, అమాయకుల ప్రాణాలతో ఆడుకునే ఒక ఘోరమైన హత్యాయత్నం అని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తూ వారి ప్రాణాలు హరించే కల్తీ మాఫియాపై పీడీ యాక్ట్ ప్రయోగించడానికి కూడా వెనుకాడబోమని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. ఆహార కల్తీ మహమ్మారిని అరికట్టడంలో పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకమని సజ్జనార్ పిలుపునిచ్చారు. పరిసరాల్లో ఎక్కడైనా ఆహార పదార్థాల కల్తీ జరుగుతున్నట్లు అనుమానం వచ్చినా, లేదా అపరిశుభ్ర వాతావరణంలో ఆహారం తయారు చేస్తున్నట్లు తెలిసినా ఏమాత్రం సంకోచించకుండా వెంటనే డయల్ 100కి గానీ, హెచ్-ఫాస్ట్ నంబర్ 8712661212కు వాట్సాప్ లేదా ఫోన్ ద్వారా సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సురక్షిత, ఆరోగ్యవంతమైన హైదరాబాద్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

# 1970 గజాల పార్కును కాపాడిన హైడ్రా

**-రూ. 20 కోట్ల విలువైన భూమికి హైడ్రా ఫెన్సింగ్**



పార్కుస్థలం చుట్టు ఫెన్సింగ్ వస్తున్న దృశ్యం

హైదరాబాద్, జులై 4,(ప్రభాతవార్త): పార్కుల కబ్జాలను తొలగించి కాలనీ వాసులకు ప్రాణవాయువుతో పాటు సేదదీరేందుకు వెసులుబాటు కల్పిస్తున్న హైడ్రా శనివారం మరో పార్కును కాపాడింది. లే ఔట్ వేసిన ప్పుడు పార్కుగా చూపించి.. తర్వాత ప్లాట్లుగా మార్చేస్తున్న వైనాన్ని అడ్డుకుంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మండలం, గ్రామం లోని సర్వే నంబర్ 873, 882లో 13.31 ఎకరాల మేర 256 ప్లాట్లతో సాయి శ్రీనిలయ పేరిట 2000 సంవత్సరంలో లే ఔట్ వేశారు. ప్లాట్ నంబర్లు 111, 112, 113, 114, 115, 116 కలిపి మొత్తం 1,970 చదరపు గజాల విస్తీర్ణం పార్కు కోసం కేటాయించారు. ఇందులోని సుమారు 400 చదరపు గజాల స్థలాన్ని కొందరు అక్రమంగా ఆక్రమించి, ప్లాట్లుగా విభజించి, ప్రీకాస్ట్ కాంక్రీట్ బ్లాకులతో ప్రహరీ నిర్మించారని సాయి శ్రీ నిలయ రెసిడెన్ట్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సంబంధిత శాఖల అధికారులతో హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. పార్కు కబ్జాను నిర్ధారించుకుంది. శనివారం ఈ మేరకు పార్కు స్థలంలో ప్రీకాస్ట్ కాంక్రీట్ బ్లాకులతో నిర్మించిన ప్రహరీలను తొలగించింది. పార్కు హద్దులను నిర్ధారించింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. పార్కు స్థలం చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. శనివారం హైడ్రా కాపాడిన పార్కు స్థలం విలువ రూ. 20 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. కబ్జాలను తొలగించి 1970 గజాల పార్కును కాపాడిన హైడ్రాకు కాలనీ నివాసితులు కృతజ్ఞతలు తెలిపారు. హైడ్రాకు ఫిర్యాదు చేసిన వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి.. సంబంధిత శాఖల అధికారులతో పాటు.. కాలనీవాసులతో విచారించి చర్యలు తీసుకోవడాన్ని అభినందించారు. ప్లాట్ల సేల్ డీడ్ల ప్రకారం ఉన్న హద్దులు ఆధారంగా పార్కు స్థలాన్ని నిర్ధారించుకుని వెంటనే ఆక్రమణలు తొలగించి పార్కుగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేయడంపట్ల హర్షం వ్యక్తం చేశారు.

# మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు నివాళులు



రోశయ్య చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న సిఎండీ జితేష్ పాటిల్, డైరెక్టర్లు శివాజీ, చక్రపాణి తదితరులు

హైదరాబాదాద్,జూలై 4, ప్రభాతవార్త:

మాజీ ముఖ్యమంత్రి శ్రీ కొణిజేటి రోశయ్య గారి 93వ జయంతి సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ స్కాడా కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆసయ సేవలు స్మరించుకున్నారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్), ఐటీ మాస్టర్ ప్లాన్ వట్టికొండ శివాజీ, డైరెక్టర్ కమర్షియల్, హెచ్ఆర్‌డీ చిలుకమారి చక్రపాణి కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొని రోశయ్య గారికి ఘన నివాళులు అర్పించారు

# అనుమానంతో భార్యను కత్తితో పొడిచి దారుణహత్య..!

**పోలీసుల అదుపులో నిందితుడు : ఆనాధగా మారిన కుమార్తె**

**ఉప్పల్, జూలై 3 ప్రభాతవార్త :** అనుమానం పెనుభూతంగా మారి ఒక వ్యక్తి తాళి కట్టిన భార్యను కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ చిలుకానగర్‌లో నివసించే పాపితోట్టి సురేష్ (42) ప్రైవేటు సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి 2015 సంవత్సరంలో, పెద్దల సమక్షంలో పాపితోట్టి జెస్సికా (37) అనే మహిళతో పెళ్లి జరిగింది. వీరికి పది ఏళ్ల కుమార్తె ఉంది. జెస్సికా నర్సుగా పనిచేస్తుండగా, సురేష్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేసి జీవనం సాగిస్తున్నారు. అయితే గత కొంత కాలంగా భార్యపై అనుమానంతో తరుచూ భార్యను వేధిస్తున్నాడు. ఇదే క్రమంలో గతంలో పలుమార్లు వీరి మధ్య గొడవలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. కాగా శనివారం ఉదయం జెస్సికా, సురేష్‌ల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆవేశంతో ఇంట్లో ఉన్న కత్తితో భార్యను పలుమార్లు పొడవడంతో ఆమె అక్క డికక్కడే మృతి చెందింది. అనంతరం నిందితుడు భార్య అక్కకు ఫోన్ చేసి జెస్సికాను చంపినట్లు చెప్పి అక్కడి నుంచి పరారైయ్యాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతురాలి ఒంటిపై ఆమె ఛాతీ, ఎడమ భుజం, ఎడమ చంకపై కత్తిపోట్లు ఉన్నాయని పోలీసులు తెలిపారు. తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఉప్పల్ ఎసిపి వెంకటరెడ్డి, సిఐ రామలింగారెడ్డి ఇతర అధికారులు సంఘటనా స్థలంలో విచారణ చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తల్లి హత్యకు గురికావడం తో తండ్రి పోలీసులకు చిక్కడంతో వారి కుమార్తె అనాథగా మారింది. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నల్ల మందు విక్రేత అరెస్టు

**సరూర్‌నగర్, జూలై 4 ప్రభాతవార్త:** మత్తు పదార్థమైన నల్లమందును విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు రూ.5 లక్షల విలువ జేసే నల్ల మందును, ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హార్డ్‌వేర్ షాపులో పని చేసే గచ్చిబౌలి గోపన్‌పల్లి ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన సురేష్ దేవసి (39) జల్సా జీవితం కోసం ఎక్కువ మొత్తం సంపాదించాలనే ఉద్దేశ్యంతో డిమాండ్ ఉన్న నల్ల మందును విక్రయిస్తున్నాడు. రాజస్థాన్‌కు చెందిన సతీష్ నుండి నల్ల మందును తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన అవసరమైన వారికి అధిక డబ్బులకు విక్రయిస్తుంటాడు. ఈ నేపథ్యంలో విశ్వసనీయ సమాచారం మేరకు శంషాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు నిందితుడి వద్ద నుండి ఒక కిలో నల్లమందును, ఒక స్మార్ట్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని విచారణ నిమిత్తం బాలాపూర్ పోలీసులకు అప్పగించారు. కేసును నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్ఐఆర్‌తో ఓటు హక్కుకు ముప్పు : మాజీ న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి

చిక్కడపల్లి జూలై 4 ( ప్రభాతవార్త )



ప్రసంగిస్తున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి

తెలంగాణలో చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ వల్ల ఓటు హక్కుకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఓటర్ల హక్కుల వేదిక ఆధ్వర్యంలో శనివారం బాగలింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన తెలంగాణలో ఎస్ఐఆర్ – ఓటు హక్కు పరిరక్షణ, ప్రజల డిమాండ్లు ఖి అంశంపై బహిరంగ చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్బంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో చిన్న పొరపాటు జరిగినా ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి నెలకొంటోందని, రాజ్యాంగం ప్రకారం కుల, మత, వర్గ భేదాలు లేకుండా ప్రతి అర్హ పౌరుడికి ఓటు హక్కు కల్పించాలని అన్నారు. స్వాతంత్రానంతరం సమగ్ర ఓటరు నమోదు ప్రక్రియ అమలులోకి వచ్చిందని గుర్తు చేస్తూ, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ప్రజాస్వామ్య స్పూర్తికి విరుద్ధంగా ఉన్నాయన్నారు. ప్రజలు పాలకులను ఎన్నుకోవాలి గానీ, పాలకులే ఓటర్లను ఎంచుకునే పరిస్థితి ఏర్పడుతోందన్న సందేహం ఎస్ఐఆర్ ప్రక్రియ కలిగిస్తోంది" అని వ్యాఖ్యానించారు. గతంలో ఇలాంటి పరిణామాలపై రాజకీయ నాయకులు కూడా హెచ్చరించినా తగిన ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. శాసనమండలి సభ్యుడు ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ ఓటు హక్కు అనేది పౌరుడి అత్యున్నతమైన ఆయుధమని, దాని రక్షణ కోసం ప్రతి ఒక్కరూ గళమెత్తాలని పిలుపునిచ్చారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత లోపించడం వల్ల అర్హులైన సామాన్యుల ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ ప్రక్రియపై తక్షణమే సమగ్ర సమీక్ష జరపాలని, ప్రజల డిమాండ్లను ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత కొన్ని నెలలుగా ఓటర్ల హక్కుల కోసం క్షేత్రస్థాయిలో పోరాడుతున్న వివిధ సామాజిక వర్గాలు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఈ చర్చా వేదికలో పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సమావేశంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పద్మజ షా, తెలంగాణ ఓటర్ల హక్కుల వేదిక ప్రతినిధులు సౌమ్య కిదాంబి. మేరీ డయాస్ , శంకర్, మీరా సంఘమిత్ర తదితరులు పాల్గొన్నారు.

## సాహిత్యరంగంలో తెలుగుకు ప్రాధాన్యం : గుత్తా సుఖేందర్‌రెడ్డి

**నాంపల్లి, జూలై 4 ప్రభాతవార్త :**



ఆచార్య మాదిరాజు రంగారావు గ్రంథాలను ఆవిష్కరిస్తున్న గుత్తాసుఖేందర్‌రెడ్డిడ, రమణాచారి, ఉడయవర్లు, గుడిపాటి, సంతోష్‌కుమార్

సాహిత్యరంగంలో తెలుగుకు ఉన్న ప్రాధాన్యత, రుచి అభిరుచి చాలా ఎక్కువని తెలంగాణ శాసనమండలి అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషానిలయం ఆధ్వర్యంలో భాషానిలయంలోని రావిచెట్టు రంగారావు సభావేదికలో శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, శ్రీకృష్ణదేవరాయ తెలుగుభాషానిలయం అధ్యక్షుడు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగిన ఆచార్య మాదిరాజు రంగారావు సాహిత్యం–పరామర్శ సాహిత్య సదస్సు ప్రారంభోత్సవ సభను తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు ముఖ్యఅతిథిగా, మాదిరాజు సంతోష్‌కుమార్ తదితరులు ప్రారంభించగా సాయంత్రం వరకు డా. జి.నరసింహమూర్తి, టి.ఉడయవర్లు అధ్యక్షతన రెండు సాహిత్య సమావేశాలు విజయవంతంగా జరగగా ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గుత్తా సుఖేందర్‌రెడ్డి విశిష్ట అతిథులు పాలపిట్ట ఎడిటర్ గుడిపాటి వెంకటేశ్వర్లు, సంతోష్, ఆదిత్య, హారిక, చరిత, భాషానిలయం గౌరవ కార్యదర్శి టి.ఉడయవర్లు తదితరులతో కలిసి ఆచార్య మాదిరాజు రంగారావు సాహిత్యం–పరామర్శ గ్రంథం; ఆచార్య మాదిరాజు రంగావు ప్రత్యేక సంచిక పాలపిట్ట సాహిత్య మాసపత్రికలను ఆవిష్కరించి ప్రసంగించారు.

# ప్రజా 'ఫిర్యాదు'ల పరిష్కారానికి పెద్దపీట

**-మైక్యూర్,ప్రజావాణి,వాట్సాప్, ట్విట్టర్ ద్వారా సేకరణ**
**-సిఎంసి పరిధిలో 74జంక్షన్లు.. 54వాటర్ లాగిన్ పాయింట్లు**
**-44ప్రాంతాల్లో పనులుపూర్తి..చెరువుల్లోకి నీరు చేరేలా చర్యలు**
**-మిగతా ప్రాంతాల్లో పంపింగ్..మాన్‌సూన్ సిబ్బంది ఏర్పాటు**
**-సిఅండ్‌డి వేస్టేజ్ రోడ్డుపక్కన వేస్తే 10లక్షలు వరకు జరిమానా**
**-మీడియా చిట్‌చాట్‌లో సిఎంసి కమిషనర్ సృజన**



చిట్‌చాట్‌లో మాట్లాడుతున్న కమిషర్ జి.సృజన

హైదరాబాద్,జూలై 4, ప్రభాతవార్త:

ప్రజావాణి ఫిర్యాదలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని సిఎంసి కమిషనర్ జి.సృజన అన్నారు. ఈమేరకు శనివారం సిఎంసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా చిట్‌చాట్‌లో ఆమె మాట్లాడుతూ...మైక్యూర్, ప్రజావాణి, వాట్సాప్, ట్విట్టర్ ద్వారా వచ్చే ఫిర్యాదులు, సూచనలు ఎప్పటికప్పుడు రికార్డు చేస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఒకసారి ప్రజావాణికి వచ్చే ఫిర్యాదును వారంలోగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని కానీ వివిధ కారణాలవల్ల టౌన్‌ప్లానింగ్ ఫిర్యాదుల పరిష్కారం ఆలస్యం జరుగుతందన్నారు. ప్రతిరోజు ప్రతివార్డులో భాగంగా ఇప్పటివరకు ప్రతి సర్కిల్‌ను 2నుంచి మూడు సార్లు సందర్శించాని స్థానిక సమస్యల ఒకొక్కటికిగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు.అలాగేహోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యతపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి, వాటి ప్రమాణాలను బట్టి రేటింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు.సిఎంసికి సంబంధించి 777 ప్రభుత్వ ఆస్తులను గుర్తించామని వీటిలో సుమారు 440 ప్రాంతాల్లో కాంపౌండ్ వాల్ లేవని ఇప్పటికే ఉన్నవాటిని పార్కులుగా తీర్చిదిద్దుతున్నామన్నా రు. ముఖ్యంగా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అన్ని వయస్సుల వారికి అనువైన ఫిజికల్ యాక్టివిటీ కేంద్రాలుగా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

**74జంక్షన్లు...54 వాటర్ లాగిన్ పాయింట్లు**

సీఎంసీ పరిధిలో మొత్తం 74 జంక్షన్లు ఉండగా ఆయా కూడళ్ల అభివృద్ధి చేపట్టినట్లు తెలిపారు. అలాగే 54 వాటర్ లాగింగ్ పాయింట్లు గుర్తించామని, అందులో 38 ప్రాంతాల్లో పనులు ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన ప్రాంతాల్లోనూ పంపింగ్ సిస్టం.. మాన్‌సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్లౌడ్‌బరస్ట్ వంటి తీవ్ర వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్‌సిటీ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టామన్న కమిషనర్.. ఆయా ప్రాంతాల్లో భూసేకరణకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఖాజాగూడ–ట్రిపుల్ ఐటీ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అలాగే టిడిఆర్‌లు జారీ కాకపోవడం వాస్తవమేనని నిధుల కొరత కారణంగా భూసేకరణ ప్రక్రియ కొంతకాలం నిలిచిపోయిందన్నారు. త్వరలో భూసేకరణప్రారంభించి, భూ యజమానులకు పరిహారంగా టీడీఆర్‌లను జారీ చేస్తామని తెలిపారు. సీ అండ్ డీ (కన్‌స్ట్రక్షన్ అండ్ డెమాలిషన్) వ్యర్థాలను రోడ్ల పక్కన పడేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై రూ.1 లక్ష నుంచి రూ.10లక్షల వరకు జరిమానా విధించడంతో పాటు అవసరమైతే సంబంధిత వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

## సిసి కెమేరాల ద్వారా చెత్త పారవేసేవారిపై చర్యలు : ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్, జూలై 4 ప్రభాతవార్త



కాలనీల్లో విస్తృత క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తున్న ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

పారిశుధ్యం, పచ్చదనం, దోమల నివారణ,మౌలిక వసతుల అభివృద్ధిపై మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శనివారం పర్యటించారు. వివిధ విభాగాల అధికారులతో కలిసి ఆయన విస్తృత క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, వర్షాకాల సన్నద్ధత,ప్రజల భాగస్వామ్యంతో నగరాన్ని మరింత పరిశుభ్రంగా, పచ్చగా తీర్చిదిద్దేందుకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. గుంటి జంగయ్య కాలనీలోని గార్బేజ్ వల్నరబుల్ పాయింట్‌ను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్త, నిర్మాణ వ్యర్థాలు, మట్టి కుప్పలు మరియు ఇతర డెబ్రిస్‌ను తక్షణమే పూర్తిగా తొలగించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాలు,దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి అవసరమైన దాతలను గుర్తించాలని అధికారులకు ఆదేశించారు. సీసీ కెమెరాల ద్వారా అక్రమంగా చెత్త పారవేసే వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జహంగీర్‌నగర్‌కాలనీలోని గార్బేజ్ వల్నరబుల్ పాయింట్‌ను పరిశీలించిన కమిషనర్ అక్కడ జరుగుతున్న శుభ్రత పనులను సమీక్షించి భవిష్యత్తులో అక్కడ చెత్త పేరుకుపోకుండా పచ్చదనంతో అభివృద్ధి చేయాలని సూచించారు. మొక్కలు నాటి నిరంతరం నీరు పోయడం, ఎరువులు వేయడం, రక్షణ కల్పించడం వంటి చర్యలు చేపట్టి మొక్కల మనుగడను నిర్ధారించాలని సూచించారు. హరిహరపురం ప్రాంతంలోని ప్రధాన నాలాను కమిషనర్ పరిశీలించి, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలాలో పేరుకుపోయిన సిల్ట్, చెత్త,ఇతర అవరోధాలను పూర్తిగా తొలగించాలని అధికారులకు ఆదేశించారు. గుర్రంగూడ అర్బన్ ఫారెస్ట్ కుంటను పరిశీలించిన కమిషనర్ దోమకారక డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నగరంలో పచ్చదనాన్ని మరింత విస్తరించేందుకు అర్బన్ బయోడైవర్సిటీ విభాగ అధికారులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ప్రతి కాలనీలో ఎత్తుగా పెరిగే వృక్ష జాతులను గుర్తించి విస్తృత స్థాయిలో నాటే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రోడ్ల పక్కన, కాలనీల్లో, ఖాళీ ప్రభుత్వ స్థలాల్లో పెద్ద వృక్షాలను నాటి హరిత కవచాన్ని పెంచేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

## ప్రతి ఐదు బూత్‌లకు ఒక కో-ఆర్డినేటర్

**- సర్‌పై సమీక్షలో ఎమ్మెల్యే నవీనన్‌యాదవ్**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, చిత్రంలో భవానీశంకర్ తదితరులు.

**జూబ్లీహిల్స్, జూలై 4, ప్రభాతవార్త:**
ప్రతి డివిజన్‌లో పనిచేస్తున్న బీఎల్‌ఏలను సమన్వయం చేసుకొని పనిచేయాలని కాంగ్రెస్ శ్రేణులకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ కార్యాలయంలో సర్‌పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి అయిదు బూత్‌లకు ఒక కో-ఆర్డినేటర్‌ను నియమించామన్నారు. బీఎల్‌ఏలను సమన్వయం చేసుకొని కో-ఆర్డినేటర్లు ముందుకు వెళ్లాలన్నారు. ప్రజలకు పంపిణీ చేసిన దరఖాస్తు పత్రాలలో వివరాలు అన్ని ఉండేలా చూడాలన్నారు. కో-ఆర్డినేటర్లు సైతం తమ పరిధిలోని బీఎల్‌ఏల పనితీరును పర్యవేక్షించాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలను కలిసి పార్టీ కార్యాక్రమాలను సైతం వివరించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు భవానీశంకర్, ఆరిఫ్, లవకుమార్, సంజయ్ గౌడ్ పాల్గొన్నారు.

## రంగస్థలరంగానికి ఎం.వి.రామారావు సేవలు ఎనలేనివి



పురస్కార గ్రహీతలతో రమణాచారి, నిత్యానందరావు, రమణ, వాసవదత్త తదితర అతిథులు

**రవీంద్రభారతి, జూలై 4 ప్రభాతవార్త :**
ప్రఖ్యాత రంగస్థల నటుడు, దర్శకుడు ఎం.వి.రామారావు రంగస్థల రంగానికి చేసిన విశిష్ట సేవలు ఎనలేనివిని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో శ్రీదత్త సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశమందిరంలో సంస్థ 16వ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన డా.కె.వి.రమణాచారి ప్రఖ్యాత రంగస్థల, చలనచిత్ర, రేడియోన నటుడు, దర్శకుడు, రచయిత, నాటక ప్రయోక్త, నటశిక్షకుడు ఎం.వి.రామారావు 91వ జయంతిని పురస్కరించుకుని సభాధ్యక్షుడు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు సభాధ్యక్షతన విశిష్ట అతిథులు డా. సత్యవోలు సుందరసాయి, డా. మోహిత్, సంస్థ అధ్యక్షుడు కామరాజు రమణ, ప్రధాన కార్యదర్శి కామరాజుగడ్డ వాసవదత్త రమణ తదితరులతో కలిసి ముందుగా ఎం.వి.రామారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించి అనంతరం ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, రచయిత బి.ఎం.రెడ్డిని ఘనంగా సత్కరించి ఎం.వి.రామారావు రంగస్థల పురస్కారం; ప్రముఖ కథ, నవల, నాటక రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మిని ఘనంగా సత్కరించి ఎం.వి.రామారావు, శ్రీమతి మల్యాల హైమవతి కళా పురస్కారం ప్రదానం చేసి శుభాభినందనలు తెలిపారు. అనంతరం ప్రముఖకవి, రచయిత డా. అమరేంద్ర రచించిన గీతాంజలి తెలుగు అనువాద పుస్తకాన్ని ఆవిష్కరించారు.

## పాఠశాలలో ఘనంగా వనమహోత్సవం



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 4, ప్రభాతవార్త**
కూకట్‌పల్లిలోని గీతాంజలి పాఠశాలలో వన మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు చెట్లు నాటుదాం ప్రకృతిని కాపాడుదాం, ఒక్క మొక్క ఒక జీవం వంటి నినాదాలతో ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల చైతన్యం కల్పించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వన మహోత్సవం ద్వారా విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ప్రేమ, పర్యావరణ పరిరక్షణపై బాధ్యతాభావం పెంపొందేలా చేశారు.

## నేడు చుడీబజార్‌అరుంధతీ సేవా మండలి కేంద్ర కమిటి ఎన్నికలు



వివరాలను వెల్లడిస్తున్న ఎన్నికల కమిటి చైర్మన్ ఎద్దుల రవీందర్

**గోషామహల్, జూలై 4ప్రభాతవార్త:**
చుడీబజార్‌లోని అరుంధతీ సేవా మండలి కేంద్ర కమిటి ఎన్నికలు నెల 5వ తేది ఆదివారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరుగుతుందని అరుంధతీ సేవా మండలి కేంద్ర కమిటి ఎన్నికల చైర్మన్ ఎద్దుల రవీందర్, వైస్‌చైర్మన్ పాలేం వెంకటేష్‌లు తెలిపారు. శనివారం మండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్నికల కమిటి సభ్యులుడి. యాదయ్య, జెన్నుశ్యామ్, మిరకడప లక్ష్మినారాయణ, దేవేందర్‌లతో కలిసి ఎన్నికల కమిటి చైర్మన్ ఎద్దుల రవీందర్, వైస్ చైర్మన్ పాలేం వెంకటేష్‌లు మాట్లాడుతూ చుడీబజార్‌లోని ఆరుంధతీ సేవా మండలి కేంద్ర కమిటి అధ్యక్ష పదవికి ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉన్నట్లు తెలిపారు. కేంద్ర కమిటి కింద ఉన్న 26 దళిత బస్తీలకు చెందిన దాదాపు 4వందలపై చిలుకు ఓట్లు ఉన్నాయని వారు తెలిపారు. కేంద్ర కమిటిజారీ చేసిన ఓటర్ గుర్తింపు తీసుకుని వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సాయంత్రం 5గంటలకు ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు.



ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపి వి.హనుమంతరావును సీనియర్ కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. సోమాజిగూడలోని ఏసియాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విహెచ్‌ను శనివారం నల్లకుంట డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ ఎ.జ్యోతియాదగిరిగౌడ్, పిసిసి మాజీ కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్‌లు పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు.

## భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య : ఎమ్మెల్యే ముఠాగోపాల్



కార్యక్రమంలో పాల్గొన్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, పింగళి వెంకయ్య స్మారక సంస్థ చారిటబుల్ ట్రస్టు చైర్ పర్సన్ కోదూరి శ్యామల రావు, కోదూరి శ్రీదేవి

**చిక్కడపల్లి జులై 4 ( ప్రభాతవార్త ) :** భారత జాతీయ పతాక రూపకర్త, మహోన్నతుడైన గాంధేయవాది పింగళి వెంకయ్య అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం రామ్ నగర్ ఈసేవ కేంద్రం ఆవరణంలో పింగళి వెంకయ్య స్మారక సంస్థ చారిటబుల్ ట్రస్టు చైర్ పర్సన్ కోదూరి శ్యామల రావు, ట్రస్ట్ చైర్ పర్సన్ కోదూరి శ్రీదేవి ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య గారి 63వ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా ఫలహార పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఠాగోపాల్ ప్రారంభించి ప్రసంగించారు. భారతజాతికి సగర్వంగా నిలిచే త్రివర్ణ పతాకాన్ని అందించి, మహాత్మా గాంధీ చేతనే ఎనలేని మన్ననలు పొందిన గొప్ప మహానీయుడు అని అన్నారు. శ్యామల రావు మాట్లాడుతూ దేశభక్తుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ, ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను ట్రస్ట్ భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో టీ.పీ.సీ.సీ. సెక్రటరీ జి.ఎన్. కేశవ్, బి.జె.పి. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ మెంబర్ రొయ్యూరు శేషసాయి, బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, నేత శ్రీనివాస్, మేడి సత్యనారాయణ, సంస్థ జనరల్ సెక్రటరీ శ్రీ బంగారు ప్రశాంత్, సెక్రటరీ సుధాకర్ రెడ్డి, సభ్యులు కర్రా వెంకటేష్, విజయ్ యాదవ్, కిరణ్, కరణం సురేష్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## ఇనాక్ సాహిత్యం పరిశోధన విద్యార్థులకు ఉపయుక్తం : హాస్యావధాని శంకరనారాయణ



ప్రముఖ రచయిత్రి వేమూరి కమలాకర్ సుజాత రచించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యం ఒక పరిశీలన గంథాన్ని ఆవిష్కరిస్తున్న హాస్యావధాని శంకరనారాయణ

**చిక్కడపల్లి జులై 4 ( ప్రభాతవార్త ) :** ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ రచనలు తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించాయని, ఆయన సాహిత్యంపై జరిగే అధ్యయనం, పరిశోధనలు విద్యార్థులు, పరిశోధకులకు ఎంతో ఉపయోగపడతాయని హాస్యావధాని శంకరనారాయణ పేర్కొన్నారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళా సుబ్బారావు కళావేదికపై భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రఖ్యాత సాహితీ సంస్థ ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ రచయిత్రి వేమూరి కమలాకర్ సుజాత రచించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యం ఒక పరిశీలన గ్రంథావిష్కరణ సభ గానసభ పాలకమండలి సభ్యుడు బండి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాస్యావధాని శంకరనారాయణ గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఇనాక్ రచనల్లో సామాజిక చైతన్యం, దళిత దృక్పథం, మానవీయ విలువలు, భాషా వైవిధ్యం, విమర్శనా దృష్టి సమన్వయంగా కనిపిస్తాయని వారు వివరించారు. ప్రముఖ సాహితీవేత్త బిక్కి కృష్ణ మాట్లాడుతూ ఆయన నవలలు, కథలు, నాటకాలు, విమర్శ గ్రంథాలు పరిశోధనకు విస్తృత అవకాశాలు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రముఖ రచయిత్రి శైలజామిత్ర మాట్లాడుతూ తెలుగు సాహిత్య విమర్శ, పరిశోధన రంగాలకు ఇనాక్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పరిశోధన విద్యార్థులు ఇనాక్ సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేయడం ద్వారా సమాజాన్ని అర్థం చేసుకునే విశ్లేషణాత్మక దృష్టి పెంపొందుతుందని అభిప్రాయపడ్డారు. విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ఇనాక్ రచనలపై మరిన్ని సదస్సులు, చర్చాగోష్టులు నిర్వహించాలని సూచించారు. ప్రముఖ గాయని మల్లాది ఉష బృందం ఆధ్వర్యంలో గానకార్యక్రమం, కరుణశ్రీ శిష్యబృందం ఆధ్వర్యంలో నృత్య కార్యక్రమం అలరించింది.

## బిజెపి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలి: రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మాధవి



అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మాధవి

**నిజాంపేట్, జూలై 4, ప్రభాతవార్త**
రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకిత భావంతో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీమతి కొల్లి మాధవి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్ 276వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు టి. నరేంద్ర చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీలో చేరికల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన సిరికొండ శ్రీనివాస్, యువమోర్చా నాయకుడు దొడ్డ పవన్, రామరాజు, ఎం కాలనీకి చెందిన పలువురు స్థానికులకు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కొల్లి మాధవి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా ప్రజల విశ్వాసాన్ని పొందుతూ విజయపరంపరను కొనసాగిస్తోందన్నారు. తెలంగాణలో కూడా బీజేపీ జెండాను ఎగరవేసే దిశగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా ప్రగతి నగర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు బీజేపీ నాయకులు ర్యాలీగా వెళ్లి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి నగర్ డివిజన్ అధ్యక్షుడు టి. నరేంద్ర చౌదరి, రాష్ట్ర నాయకురాలు వడ్లమూడి సులోచన, జిల్లా నాయకులు సుమన్ రావు, జక్కుల రవి యాదవ్, మందపాటి శ్రీధర్ రెడ్డి, సంతోష్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్ గౌడ్, సాయి కిషోర్, ఉపాధ్యక్షులు శివకుమార్ గుప్తా, సత్యనారాయణ, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సప్త మాతృకలకు సప్త బంగారు బోనాలు



సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి చైర్మన్ మధు సూదన్ యాదవ్

**చార్మినార్, జూలై 4 ప్రభాతవార్త :**
ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలలో భాగంగా సప్త మాతరం సప్త బంగారు బోనం కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని భాగ్యనగర్ శ్రీ మహంకాళీ జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి చైర్మన్ మల్యాల మధుసూదన్ యాదవ్ తెలిపారు. పాతబస్తీ బేలా అశోక్ పిల్లర్ చౌరస్తా సమీపంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి నూతన కార్యాలయాన్ని శనివారం కమిటి కార్యవర్గ ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఊరేగింపు కమిటి ప్రతినిధులు పొటెల్ సబూత్ యాదవ్, సతీష్ గౌడ్, శశాంక్ తివారీ, రాము గౌడన, శ్రీ కాంత్, అశోక్ రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

## దూద్‌బౌలిలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం

**చార్మినార్, జూలై 4 ప్రభాతవార్త :** పాతబస్తీ దూద్‌బౌలి మహారాజ్‌గంజ్‌లోని శ్రీ సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి మరియు శ్రీ సీతారామ వీరాంజనేయ స్వామి దేవస్థానములలో ఐదు రోజుల పాటు అత్యంత వైభవంగా కొన సాగిన బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిసాయి. శ్రీ గణపతి స్వామి, శ్రీ సీతారామ, వీరాంజనేయ స్వామి వార్లకు 108 కలశములతో అభిషేకం, ఊంజల్ సేవ తదితర కార్యక్రమాలు జరిగాయి. అనంతరం మందిరం ఆవరణలో అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానముల వంశ పారం పర్య ధర్మ కర్త మహేశ్వరం శ్రీనివాస్ చారి, కార్యవర్గ సభ్యులు మహేశ్వరం నాగేశ్వర చారి, కార్యదర్శి ఆకుల శివ కుమార్, దేవాలయం ప్రధాన అర్చకులు సి.వీరయ్య శర్మ పాల్గొన్నారు.

## ఘనంగా భారతీయ క్రిస్టియన్ గాస్పల్ డే



రక్షణ సువార్తను తీసుకువస్తున్న యేసు శిష్యులు

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** భారతీయ క్రిస్టియన్ గాస్పల్ డే బర్కత్‌పుర డివిజన్ కూతిబిగూడలోని సెయింట్ థామస్ చర్చిలో ఘంగా నిర్వహించారు. శనివారం జరిగిన ఈ వేడుకల సందర్భంగా రివరెండ్ ఫాదర్ దొమనిక్ సెవినో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పరిశుద్ధ తోమాగారి పల్లకిలో ఊరేగించారు. ప్రతి భారతీయ క్రైస్తవుడు క్రీస్తును రక్షకునిగా అంగీకరించి, ఏసు ద్వారా పరలోక రాజ్యం చేరాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ డిద్ది రాంబాబు, అరుల్ విజయ్, బెన్న క్లింటన్, లాజర్, డాను బాస్కొ తదితరులు పాల్గొన్నారు.

## జోరందుకున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ



ఓటరు నమోదు పత్రాలు పంపిణీ చేస్తున్న ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె రూబీ స్టీవెన్‌సన్

**హైదరాబాద్, జులై 4 ప్రభాతవార్త**
ఓటరు జాబితా సవరణ కార్యక్రమం 'సర్'లో భాగంగా అంబర్‌పేటలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ జోరందుకుంది. అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె రూబీ స్టీవెన్‌సన్ స్థానికులకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఓట్లు ఉన్న అందరూ ఎన్యుమరేషన్ ఫారాలను తప్పులు లేకుండా నింపి బిఎల్‌ఓలకు అందజేయాలని సూచించారు. లేనిపక్షంలో వారి ఓట్లు ఓటర్ జాబితా నుంచి తొలగించబడతాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయంలో తగు జాగ్రత్త వహించి తమ ఓట్లను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జి.వరలక్ష్మి , తిరుపతి గుప్తా , బిఎల్‌వో షేక్ ఇక్బాల్ , మహ్మద్ వాజిద్ , సాజిద్ ఖాన్, బిఎల్‌వో రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు

## మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి



అల్లూరి సీతారామరాజుకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 4, ప్రభాతవార్త**
విప్లవ వీరుడు మన్యం దొర అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు 129వ జయంతిని పురస్కరించుకుని నివాళులు అర్పించారు. భాగ్యనగర్ కాలనీ ఉషా ముళ్లపూడి రోడ్డులో గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి బిజెపి సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మాధవరం కాంతారావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు అల్లూరి రామరాజు, వీరమల్ల కేశవరావు మణిభూషణం, రామ్ రెడ్డి, జయప్రకాష్ నారాయణ, గోపాల్ రావు, అరుణ్ కుమార్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## న్యూ ఇండియా పార్టీ జిఎస్‌గా మాధవరావు నియామకం

**సైఫాబాద్, జులై 4 ప్రభాతవార్త:** న్యూ ఇండియా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పాశం మాధవరావు నియమితులైనారు. ఈ మేరకు శనివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయనకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.జె.వి.రాజు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలనేదే తమ పార్టీ లక్ష్యమని, పేదలకు గూడు, స్వయం ఉపాధి, విద్యా, వైద్యం ఉచితంగా అందిచాలనే తమ పార్టీ నిర్ణయానికి ప్రజలు మద్దతు పలకాలని ఆయన పిలుపునిచ్చారు.

## న్యాయవాదులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి : మంత్రి వివేక్ వెంకటస్వామి





డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ లా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, రాజ్యసభ సభ్యుడు వివేక్ కృష్ణ టంకా, ఎమ్మెల్యే వినోద్ తదితరులు

**చిక్కడపల్లి జులై 4 ( ప్రభాతవార్త ) :** 21వ శతాబ్దంలో న్యాయవాది కేవలం కోర్టు వాదనలకే పరిమితం కాకుండా సమాజ మార్పుకు మార్గదర్శిగా, రాజ్యాంగ విలువల పరిరక్షకుడిగా నిలవాలని రాజ్యసభ సభ్యుడు, భారత సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వివేక్ కృష్ణ టంకా అన్నారు. శనివారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ లా కళాశాలలో 21వ శతాబ్దంలో న్యాయవాది పాత్ర పరిణామం అంశంపై సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వివేక్ కృష్ణ టంకా మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో సాంకేతికత, కృత్రిమ మేధస్సు (ఏఐ), డిజిటల్ న్యాయ సేవల వినియోగం రోజురోజుకు పెరుగుతోందని, అయితే రాజ్యాంగ విలువలు, వృత్తి నైతికతలను ఎప్పటికీ విస్మరించరాదని సూచించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూనే సామాజిక బాధ్యతతో పనిచేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్మిక, ఉపాధి, ఫ్యాక్టరీలు, గనులు, భూగర్భ శాఖల మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా న్యాయ విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. 21వ శతాబ్దంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అన్ని రంగాలలో విప్లవాత్మక మార్పులు తెస్తోందని, న్యాయ రంగం కూడా దీనికి మినహాయింపు కాదని పేర్కొన్నారు. సదస్సులో బెల్లంపల్లి ఎమ్మెల్యే డాక్టర్ జి. వినోద్, లోక్‌సభ సభ్యుడు వంశీ కృష్ణ గడ్డం పాల్గొని న్యాయ విద్యార్థులకు ప్రోత్సాహకరమైన సందేశాలు అందించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి. సరోజా వివేక్, జాయింట్ సెక్రటరీ పి.వి. రమణ, సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి, రోషిణి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు అధ్యాపకులు, న్యాయవాదులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తర కార్యక్రమం విశేష ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు అడిగిన సమకాలీన న్యాయ, రాజ్యాంగ, వృత్తి సంబంధిత ప్రశ్నలకు వివేక్ కృష్ణ టంకా సమగ్రంగా సమాధానాలు ఇచ్చారు. యువ న్యాయవాదులు విశ్లేషణాత్మక ఆలోచన, నైతిక విలువలు, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం : డిసిపి శ్రీనివాస్



**అత్తాపూర్ జూలై4 ,ప్రభాతవార్త :** సైబర్ నేరాల విషయంలో అప్రమత్తత అవసరమని ప్రజల భయం, అత్యాశే సైబర్ నేరగాళ్లకు పెట్టుబడిగా మారుతున్నాదని రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం రాజేంద్రనగర్‌లోని టిజిఐఆర్‌డివోలో 520 మందికి రాజేంద్రనగర్ పోలీసులు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా డిసిపి శ్రీనివాస్ హాజరై సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ...అవగాహన లేమితోనే అనేక మంది సైబర్‌నేరాల బాధితులవుతున్నారని, ఏ రకమైన సైబర్ మోసం అయినా, వాటికి అడ్డుకట్ట వేయాలంటే ప్రజలకు స్వీయ అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాల నివారణకు ప్రజలను భాగస్వాములను చేస్తామన్నారు. నకిలీ స్టాక్ మార్కెట్ పెట్టుబడి యాప్‌లు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు, "డిజిటల్ అరెస్ట్" వంటి సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అలాగే డిజిటల్ చెల్లింపుల భద్రత, ప్రభుత్వ పోర్టల్‌ల వినియోగంలో జాగ్రత్తలు, ఫిషింగ్ లింకులను గుర్తించడం, సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తత వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. అనంతరం ఎసిపి శ్రీనివాస్ ,సిఐ ముత్తు యాదవ్ మాట్లాడుతూ...సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ ఆర్థిక మోసానికి గురైన వెంటనే తొలి గంటలోనే 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, దీంతో మోసపోయిన నగదును స్తంభింపజేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిఇఆర్‌టి నుండి రాష్ట్ర వనరుల ప్రతినిధులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపిడిఓలు), మరియు వ్యవసాయ నిపుణులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మనువాద దోపిడీ పార్టీలను వదిలించుకుంటూ దళితులదే రాజ్యాధికారం



సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

**సైఫాబాద్, జులై 4 ప్రభాతవార్త:** వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో దళిత బహుజన పార్టీ బలమైన అభ్యర్థులను రంగంలోకి దించుతుందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు వ్యతిరేకంగా ఏర్పాటైన నేషనల్ డెమోక్రటిక్ ఫ్రంట్‌లో తమ పార్టీ భాగస్వామ్యమని ఆయన గుర్తు చేశారు. శనివారం నాడిక్కడ పార్టీ కేంద్ర కార్యాలయంలో దళిత బహుజన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షేక్ బాషాను నియమించి, నియామకపత్రాన్ని అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మనువాద పార్టీలైన బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ దోపిడీ పార్టీలతో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు తీరని అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత బహుజన పార్టీ నాయకత్వంలోని సామాజిక న్యాయం కొనసాగుతుందని, దళిలు, మైనార్టీలు ఐక్యమైతే తెలంగాణలో దళిత జాతులదే రాజ్యాధికారమని ఆయన స్పష్టం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలం చెందిందని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విస్మరిస్తున్నదని ఆరోపించారు. రైతులు, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. ఎస్సీ, ఎసిటి సబ్ ప్లాన్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పెంచి అమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ నంబర్ ప్లేట్‌తో పట్టుబడ్డ వాహనదారులు

**జూబ్లీహిల్స్, జూలై 4, ప్రభాతవార్త:**



నకిలీ నంబరు ప్లేటుతో పట్టుబడ్డ ఆటో డ్రైవర్ శివ, చిత్రంలో ఎస్సై రామ్‌మనోహార్

ప్రత్యేక వాహన తనిఖీల నేపథ్యంలో జూబ్లీహిల్స్ మెట్రో స్టేషన్ రోడ్ నెం.5 వద్ద ట్రాఫిక్ పోలీసులు నకిలీ నంబర్ ప్లేట్‌తో తిరుగుతున్న ఒక వాహనదారుడిని గుర్తించారు. అసలు రిజిస్రేషన్ నంబర్ ఏపీ09 సీపీ9340 కాగా, దానికి బదులుగా ఏపీ09సీఏ8032 నంబర్ ప్లేట్ అమర్చినట్లు పోలీసులు గుర్తించారు. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న రౌతు శ్రీకాంత్(33) చలానాల నుంచి తప్పించుకొనేందుకు నకిలీ నంబర్ ప్లేట్ వినియోగించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మధురానగర్ ఠాణా పరిధిలోనూ ట్రాక్టర్ నంబరును ఆటోకు పెట్టుకొని ప్రయాణిస్తున్న శివపై సైతం మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈఎంఐల నుంచి తప్పించుకొనేందుకు నంబరుప్లేటును మార్చినట్లు పోలీసులు తెలిపారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటోను స్వాధీనం చేసుకొని ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థులు ఇష్టంతో కష్టపడినపుడే మంచి భవిష్యత్తు

**చాంద్రాయణగుట్ట, జులై 4, ప్రభాతవార్త :** విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని బహదూర్‌పురా మండల ఉప విద్యాశాఖ అధికారి (డిప్యూటీ ఈవో) ఆర్.సుమన్ సూచించారు. గౌలిపురా లలితాబాగ్ రోడ్డులోని శాలిబండ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను శనివారం ఉదయం ఆకస్మికంగా సందర్శించారు. ప్రార్థనా సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. పది, తొమ్మిదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖిగా చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ విద్యతోనే ముడిపడి ఉందన్నారు. ఇష్టంతో కష్టపడి చదువుకోవాలని, ఉత్తములుగా ఎదిగి చదువుకున్న బడికి తల్లిదండ్రులకు కీర్తిప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు అంజలికుమారి, ఉపాధ్యాయులు వి.మధుసూదన్ రావు, ఎస్.విజయభాస్కర్, సంధ్య, మంజుల, ప్రమీల, నవనీత, యాకుబ్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్ లీజు పేరుతో రూ.53.50 లక్షల మోసం

**జూబ్లీహిల్స్, జూలై 4, ప్రభాతవార్త:**
పెట్రోల్ బంక్‌ను లీజుకు ఇస్తానని నమ్మించి రూ.53.50 లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటనపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌కు చెందిన పెట్రోల్ బంక్ వ్యాపారి కె. సాయి వచన్ వ్యాపార విస్తరణలో భాగంగా మరో పెట్రోల్ బంక్ కోసం చూస్తుండగా, జియాగూడలోని శ్రీ తుల్జా భవాని ఫిల్లింగ్ స్టేషన్ యజమాని ఎం. రోహన్ యాదవ్ తన పెట్రోల్ బంక్‌ను ఏడు సంవత్సరాల లీజుకు ఇస్తానని ప్రతిపాదించాడు. ఇందుకోసం రూ.40 లక్షల రీఫండబుల్ సెక్యూరిటీ డిపాజిట్ తీసుకుని, అనంతరం అవగాహన ఒప్పందం కూడా చేసుకున్నాడు. ఒప్పందం ప్రకారం పెట్రోల్ బంక్ నిర్వహణకు అవసరమైన బ్యాంకు ఖాతా, మొబైల్ నంబర్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలు, ఇతర కీలక పత్రాలు ఇవ్వకుండా ఇబ్బందికి గురిచేస్తున్నాడు. అంతేకాకుండా బంక్‌లో ఉన్న ఇంధన నిల్వలు, ఇండియన్ ఆయిల్ ట్యాంకర్ బకాయిల పేరుతో మరో రూ.13.50 లక్షలు కూడా చెల్లింపులు చేయించాడు. రోజులు గడుస్తున్నా స్పందించకపోవడంతో అనుమానం వచ్చి విచారించగా అదే పెట్రోల్ బంక్‌ను మరో వ్యక్తికి లీజుకు ఇచ్చినట్లు గుర్తించాడు. దీంతో రోహన్ యాదవ్‌ను నిలదీయగా, మొత్తం డబ్బు తిరిగి చెల్లిస్తానని నమ్మించాడు. కాలయాపన చేస్తూ డబ్బు చెల్లించకపోవడంతో బాధితుడు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## బోరబండ ఎస్సై నాగుల్‌మీరాపై సస్పెండ్ వేటు

**జూబ్లీహిల్స్, జూలై 4, ప్రభాతవార్త:** బోరబండ ఎస్సై నాగుల్‌మీరాపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. వరకట్నం కోసం వేధించడమే కాకుండా మరో కానిస్టేబుల్‌తో ప్రేమాయణం కొనసాగిస్తూ తనను బెదిరించారంటూ ఎస్సై భార్య షేక్ రహీమా ఖైరతాబాద్ మహిళా పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ కేసును పోలీసులు సూర్యాపేట జిల్లా మేళ్ల చెరువు ఠాణాకు బదిలీ చేశారు. కోదాడలో ఆర్టీసీ డిపోలో షేక్ రహీమా పనిచేసే సమయంలో ఎస్సై నాగుల్‌మీరా ఆమెకు పరిచయమయ్యాడు. పంజాగుట్ట ఠాణాలో పనిచేసే సమయంల అక్కడ పనిచేసే ఒక మహిళా కానిస్టేబుల్‌కు ఆయన దగ్గరయ్యాడు. బదిలీ అయినా వారి మధ్య సంబంధం అలానే కొనసాగింది. దీనికితోడు కట్టుకున్న భార్యను శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు గురిచేయడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఈ వ్యవహారంలో ఇటీవల పత్రికల్లో, ఛానెళ్లలో కథనాలు ప్రసారం కావడంతో ఉన్నతాధికారులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకొన్నారు. ఇప్పటికే అంతర్గతంగా విచారణ చేపట్టిన పోలీసు ఉన్నతాధికారులు నాగుల్ మీరాపై సస్పెన్షన్ వేటు వేశారు.

## యువకుడిపై దాడి చేసి రూ.4 లక్షలు డిమాండ్

**జూబ్లీహిల్స్, జూలై 4, ప్రభాతవార్త:** ఫుట్‌బాల్ ఆడుతున్న సమయంలో జరిగిన గాయానికి డబ్బులు చెల్లించాలని ఒక విద్యార్థి(15)ని డిమాండ్ చేస్తూ దాడికి పాల్పడిన పలువురిపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నెం.71లోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ సమీపంలో 15 ఏళ్ల విద్యార్థిపై వేణు అనే యువకుడు, అతనితో పాటు వచ్చిన సుమారు 20 మంది దాడికి పాల్పడ్డారు. ఫుట్‌బాల్ ఆడుతున్న సమయంలో జరిగిన గాయాన్ని సాకుగా చూపుతూ వేణు శస్త్రచికిత్స కోసం రూ.4 లక్షలు ఇవ్వాలని బెదిరించారు. డబ్బులు ఇవ్వనని చెప్పడంతో ముగ్గురు వ్యక్తులు దాడి చేయగా, మిగిలిన వారు అడ్డుకున్నారు. ఇది గమనించిన చుట్టుపక్కల వారు అక్కడికి రావడంతో నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. డబ్బులు ఇవ్వకుంటే మళ్లీ దాడి చేస్తామని బెదిరించారని బాధిత విద్యార్థి ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాలికపై లైంగిక వేధింపులు.. పోక్సో కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జూలై 4, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్‌లోని గాయత్రీహిల్స్‌లో ఓ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటనలో వంశీ యాదవ్ అనే యువకుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బాలిక కుటుంబానికి సన్నిహితుడిగా ఉన్న నిందితుడు జూన్ 24న ఇంట్లో బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో అసభ్యంగా తాకాడు. బాలిక ఏడుస్తూ కుటుంబ సభ్యులకు విషయం తెలియజేసింది. వంశీ యాదవ్‌ను తన మొబైల్‌లో చిత్రీకరించేందుకు బాలిక తల్లి ప్రయత్నించగా నిందితుడు ఫోన్‌ను లాక్కొని పగులగొట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థుల సంక్షేమానికి కృషి : నవీన్ పటాలే



పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, వాటర్ ఫిల్టర్ లను అందజేస్తున్న భాగ్యనగర్ జిల్లా బీజేవైఎం అధికార ప్రతినిధి నవీన్ కుమార్ పటాలే తదితరులు

**మలక్ పేట,జూలై 4, (ప్రభాతవార్త):**
విద్యార్థులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని భాగ్యనగర్ జిల్లా బీజేవైఎం అధికార ప్రతినిధి నవీన్ కుమార్ పటాలే పేర్కొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్320 ఆధ్వర్యంలో ఆస్మాన్ ఘాడ్ లోని విద్య భారతి విజ్ఞాన కేంద్ర పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, వాటర్ ఫిల్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ జిల్లా బిజెపి అధికార ప్రతినిధి నవీన్ కుమార్ పటేల్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధి, ఆరోగ్యం కోసం లయన్స్ క్లబ్ చేస్తున్న సహాయ, సహకారాలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. సమాజానికి తమ వంతు సేవలు అందించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దీపిక, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సౌత్ డిస్ట్రిక్ట్320 ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు రజిత, శృతి, శివాని, మేఘన పాల్గొన్నారు.

## సర్ విజయవంతానికి హెల్ప్ డెస్కులు

**హయత్ నగర్, జూలై 4 (ప్రభాతవార్త):**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి, ఓటర్ల సౌకర్యార్థం నాగోల్ సర్కిల్ పరిధిలోని పెద్ద అంబర్పేట్, కుంట్లూరు డివిజన్లలో హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ సంపత్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. హెల్ప్ డెస్క్ లలో ప్రధాన ఉద్యోగులు, ఇద్దరు సహాయకులను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కుంట్లూరు డివిజన్ కు సంబంధించి ట్యాక్స్ ఇన్స్పెక్టర్ బి.రమాదేవి (96401 05630), సహాయకుడిగా సిస్టమ్ అసిస్టెంట్ సి.హెచ్. రమేష్ (70131 38436), పెద్ద అంబర్ పేట డివిజన్ కు సంబంధించి ట్యాక్స్ ఇన్స్పెక్టర్ వి. హరికుమార్ (80196 45019), సహాయ కుడిగా ఇన్వార్డ్ కృష్ణవేణి (73370 95483)ని నియమించారు. సర్ పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యాన్ని సహించబోమని బాధ్యతా యుతంగా పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీసీ సూచించారు.

## నిజమైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలు అందజేయాలి



వివరాలను తెలియజేస్తున్న కే.రాణి, శాంతి, వీర కుమారి తదితరులు

**మలక్ పేట, జూలై 4,ప్రభాతవార్త:**
నిజమైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను అందజేయాలని పలువురు మహిళలు పేర్కొన్నారు. మూసారాంబాగ్ డివిజన్ శాలివాహన నగర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు మహిళలు కే.రాణి, శాంతి తదితరులు మాట్లాడుతూ మలక్ పేట్ నియోజకవర్గం ముసారాంబాగ్ డివిజన్ పరిధిలోని మూసి పరివాహక ప్రాంత ప్రజలకు ప్రభుత్వం అందజేసిన డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాలు నిజమైన లబ్ధిదారులకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను అందుకున్న వారి గుడిసెలను పరిశీలిస్తే అన్ని విషయాలు బహిర్గతం అవుతాయని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలు అందుకున్న వారి గుడిసెలు ఎక్కడ ఉన్నాయో సంబంధిత అధికారులు గుర్తించాలని డిమాండ్ చేశారు. స్థానిక నాయకులు రెవెన్యూ అధికారుల అండదండలతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను అమ్ముకోవడం జరిగిందని ఆరోపించారు. ఇళ్ల పట్టాలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ నిర్వహించి నిజమైన లబ్ధిదారులను గుర్తించి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను కేటాయించి న్యాయం చేయాలని పేర్కొన్నారు. పలుమార్లు జిల్లా కలెక్టర్ ఆర్డీఓ సైదాబాద్ మండల అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని వివరించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను అందజేయలని కోరారు. ఈ కార్యక్రమంలో వీర కుమారి, లావణ్య, ప్రమీల, రేణుక, లక్ష్మీ, పద్మ, ఇ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజు ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి




**కుషాయిగూడ, జూలై 4, ప్రభాతవార్త...**
సాసంత విప్లవ సమరయోధుడు అపారమైన దేశభక్తి గల వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని బిజెపి మీర్పేట్ ఎస్బిఐ కాలనీ డివిజన్ అధ్యక్షులు మునిగంటి రామ్ ప్రదీప్ పేర్కొన్నారు.విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం హెచ్‌బీ కాలనీలో సూర్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ , బీజేపీ హెచ్‌బీ కాలనీ డివిజన్ అధ్యక్షులు రామ్ ప్రదీప్ మునుగంటి హాజరై అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం పేద విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రాజు సంఘం నాయకులు పెరిచర్ల కృష్ణంరాజు , రాజ్ గోపాల్ రాజు , వాసు రాజు తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానందుడికి ఘన నివాళులు



వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ సామ స్వప్న సుందర్‌రెడ్డి

**సైదాబాద్, జులై 4 ప్రభాతవార్త:** స్వామి వివేకానందుడి వర్ధంతి సందర్భంగా చంపాపేట ప్రెస్ కాలనీ వద్ద ఆయన విగ్రహానికి ఐఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్న సుందర్‌రెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

# వక్ఫ్ బోర్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

**-మంత్రిని కలిసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**



**మల్కాజ్‌గిరి , జూలై 4 ప్రభాతవార్త :**
మల్కాజ్‌గిరి నియోజకవర్గ ప్రజలను ఎన్నో రోజులుగా ఇబ్బందులకు గురిచేస్తున్న వక్ఫ్ బోర్డు సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ ని, తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ ఆసుదుల్లాని కలిసి సమస్య తీవ్రతను వివరించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 2024లో పొరపాటున మల్కాజ్‌గిరి పరిధిలోని కొన్ని సర్వే నంబర్లు 22ఎ నిషేధిత జాబితాలో నమోదవడంతో న్యూ విద్యానగర్, ఓల్డ్ నేరేడ్మెట్, రాంబ్రహ్మనగర్, దేవినగర్, దేవినగర్ ఎక్స్‌టెన్షన్, సైనిక్ నగర్, సీతారాం నగర్, కృష్ణా నగర్ తదితర ప్రాంతాల్లోని వేలాది కుటుంబాలు ఆస్తుల కొనుగోలు, అమ్మకాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి, వక్ఫ్ బోర్డు సీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఆంధ్రప్రదేశ్ గెజెట్ రికార్డులు, గౌరవ హైకోర్టు తీర్పు ఆధారంగా సంబంధిత సర్వే నంబర్లు మల్కాజ్‌గిరికి కాకుండా మల్లాపూర్ గ్రామానికి చెందినవని వివరించారు. దీనిపై మంత్రి అజారుద్దీన్, వక్ఫ్ బోర్డు సీఈఓ ఆసుదుల్లా సానుకూలంగా స్పందించి, పొరపాటున నమోదైన సర్వే నంబర్లను 22ఎ నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు అత్యవసర చర్యలు చేపడతామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను కూడా ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తుర్కపల్లి వక్ఫ్ బోర్డు స్థలంలో ఆధునిక సౌకర్యాలతో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ (షాదీఖానా) నిర్మించాలని, అలాగే దాదాపు 300 సంవత్సరాల చరిత్ర కలిగిన కౌకుర్ మస్తాన్ బాబా దర్గాను ఆధునికీకరించి అభివృద్ధి చేసి హెరిటేజ్ హోదా కల్పించాలని కోరారు.

# ఎన్నికల సమయంలోనే రాజకీయాలు.. మిగతా సమయాల్లో కాదు

**ప్రజల విషయంలో రాజకీయాలకతీతంగా పని చేయాలి**
**మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**



కాలనీవాసులతో కలిసి డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టిన సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, జూలై 4 ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలే తప్ప మిగతా సమయాల్లో కాదనీ... ప్రజల సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం శాసనసభ్యురాలు పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి సూచించారు. నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ నాదర్‌గుల్ డివిజన్-57 కిందకు వచ్చిన అల్మాస్‌గూడ స్వేచ్ఛా నివాస్‌లో రూ.2 కోట్ల నిధులతో శాశ్వత డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా హాజరైన ఆమె స్థానిక కాలనీవాసులతో కలిసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వినాయక హిల్స్ తఓ పాటు పరిసర కాలనీల్లో డ్రైనేజీ సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. చెరువుకు డ్రైనేజీ ఔట్‌లెట్ ఏర్పాటుకు ఇప్పటికే రూ.2 కోట్లకు సంబంధించిన పరిపాలన అనుమతులు వచ్చాయనీ మరో రెండు పనులకు గాను త్వరలో రూ.2 కోట్లు మంజూరు కానున్నాయని ఆమె వెల్లడించారు. ఈ పనులు పూర్తయితే వర్షాకాలంలో వరదతో పాటు డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. జిహెచ్ఎంసి పరిపాలన ప్రక్రియ కారణంగా కొన్ని పనులు ఆలస్యమైనా ప్రస్తుతం పనుల్లో వేగం పెరిగిందన్నారు. చాలా సంవత్సరాలుగా స్థానిక సమస్యలను ఓర్పుతో భరించి సహకరించిన కాలనీవాసులకు సబితారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వినాయక హిల్స్‌లో అంతర్గత రోడ్లతో పాటు మిగతా పనులను దశల వారీగా పూర్తి చేస్తామని ఆమె హామీనిచ్చారు. అన్ని ప్రాంతాల ప్రజలకు మౌళిక సదుపాయాలను కల్పిస్తూ అభివృద్ధి పనులు పూర్తి చేయడం ఎమ్మెల్యేగా తన బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. స్థానిక చెరువుల విషయమై ఆమె మాట్లాడుతూ వాకింగ్ ట్రాక్‌లు, లైటింగ్, బ్యూటిఫికేషన్ పనులను సక్రమంగా నిర్వహించి పూర్తి చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అల్మాస్‌గూడ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపిటిసి సంరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ముత్యాల కృష్ణ, మాజీ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, బిఆర్ఎస్ నాయకుడు బోయపల్లి శేఖర్‌రెడ్డి, సరిత, గీత, గాయత్రిలతో పాటు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీలవాసులు పాల్గొన్నారు.

# రూ.97లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



రామంతాపూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**రామంతాపూర్, జూలై 3 ప్రభాతవార్త :** రామంతాపూర్, వెంకట్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలో రూ.97 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని ప్రజలకు మౌళిక వసతుల కల్పనకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని డివిజన్లలో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.8లక్షలతో నెహ్రూ నగర్‌లో 100 ఎం.ఎం.మంచినీటి లైన్ పనులు, బాలాజీ నగర్, శ్రీరామ కాలనీలో రూ.15లక్షల వ్యయంతో మంచినీటి పైప్‌లైన్ పనులు, రూ.10లక్షలతో శ్రీనగర్ కాలనీలో 300 ఎం.ఎం సీవరేజ్ లైన్ పనులు, రూ.24లక్షల వ్యయంతో సత్యనగర్‌లో 200ఎం.ఎం సీవరేజ్ లైన్ పనులు, రూ.40లక్షల వ్యయంతో లక్ష్మి శ్రీకాంత్ నగర్‌లో 300/200 ఎం.ఎం సీవరేజ్ లైన్ పనులు చేపడుతున్నామని తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రవీందర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గంధం నాగేశ్వర్ రావు, డి.బాలరాజు, బోసాని పవన్, సూరం శంకర్, జహంగీర్, చాంద్‌పాషా, మంజుల, భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ప్రసన్న వేంకటేశ్వరా స్వామి కళ్యాణమహోత్సవం



స్వామివారి కళ్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

**హుడాకాంప్లెక్స్,4 జులై, ప్రభాతవార్త :** గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని కోదండరాంనగర్‌లో నెలకొన్న శ్రీ అలివేలుమంగా సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారి కళ్యాణం అంగరంగవైభవంగా జరిగింది. వేదపండితుల వేదోచ్ఛరణల మధ్య కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో అలయానికి విచ్చేశారు. అలయ ప్రాంగణం భగవన్నామ స్మరణతో మారుమ్రోగింది. అనంతరం నిర్వహించిన అన్న ప్రసాద వితరణలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. అలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. సాయంత్రం గరుడవాహనంపై జరిగిన స్వామి వారి ఊరేగింపు లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అలయ కమిటీ అధ్యక్షుడు మర్రికంటి లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి నారాయణ మూర్తి, కోశాధికారి వసంత రాజ్‌కుమార్, సభ్యులు ఎస్.టి. చారి, బిచినేపల్లి వెంకటేశ్వర్‌రావు, సూర్యనారాయణ రెడ్డి, పాల్తీ శ్రీనివాస్, బిచినేపల్లి లక్ష్మ నర్సింహ్మారావు, గంధం వెంకటేశన్వర్లు, ప్రధన అర్యకులు కారంపూడి వెంకట వరదాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## విలేకరిపై దాడి..నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**-పోలీసులకు జర్నలిస్టు సంఘాల ఫిర్యాదు**



**నేరేడ్‌మెట్ , జూలై 4,ప్రభాతవార్త :**
ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా భావించే పత్రికా రంగంపై దాడులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. విధి నిర్వహణలో భాగంగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న విలేకరులను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులు, దాడులకు పాల్పడడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని జర్నలిస్టు సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఇటీవల నేరేడ్మెట్ ప్రాంతంలో ఓ సీనియర్ విలేకరిపై జరిగిన దాడి ఘటన తీవ్ర కలకలం రేపింది. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన వాగ్వాదం అనంతరం కొద్ది రోజుల తర్వాత విలేకరిని అడ్డగించి విచక్షణారహితంగా దాడి చేయడంతో పాటు కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనతో భయాందోళనలకు గురైన బాధిత విలేకరి శనివారం నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. విలేకరిపై దాడికి పాల్పడిన జె.జె.నగర్‌కు చెందిన రాజేష్‌పై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు సంఘాల నాయకులు పోలీసులను కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పాత్రికేయులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బాధితుడు నాయుడుతో పాటు మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి గిరి గడ్డమీది, ప్రధాన కార్యదర్శి విశాల్ యాదవ్, సీనియర్ పాత్రికేయులు బాలాజీ గౌడ్, సంగమేష్, రవి యాదవ్, లక్ష్మారెడ్డి, మనోహర్, మహేష్ గౌడ్, పవన్, మహేందర్, నాగరాజు, వినోద్, గంగాధర్, శివకుమార్ తదితరులు పాల్గొని నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు

# ప్రపంచ శాంతి కోసం డిపిఎస్‌లో 'గ్లో పీస్' కార్యక్రమం

**నాచారం, జులై 4 ప్రభాతవార్త..** నాచారంలోని డీపీఎస్ పాఠశాలలో ప్రపంచ శాంతి సందేశాన్ని చాటుతూ"గ్లో పీస్" కార్యక్రమాన్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, మెదక్ పార్లమెంట్ సభ్యుడు ఎం.రఘునందన్ రావు, తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ (ఐఏఎస్), బ్రహ్మకుమారీస్ ఉప ప్రాంత ఇన్‌చార్జి బి.కె. మంజు, ఆనంద బుద్ధ విహార ప్రధాన బౌద్ధ గురువు బిక్కు బుద్ధపాల, డీపీఎస్, పీజీఓఎస్ విద్యాసంస్థల చైర్మన్, శాసన మండలి సభ్యుడు మల్కా కొమరయ్య, ముఖ్య కార్యనిర్వాహక అధికారి యశస్వి, డైరెక్టర్లు పల్లవి, త్రిభువన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎనిమిది వేల మంది విద్యార్థులు ఒకే వేదికపై యోగా ఆసనాలు, సామూహిక విన్యాసాలు ప్రదర్శించి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించి అరుదైన ఘనతను సాధించారు. పార్లమెంట్ సభ్యుడు ఎం. రఘునందన్ రావు మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుంచే విలువలతో కూడిన విద్యను అందిస్తే వారు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని అన్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు మాట్లాడుతూ యుద్ధాల ద్వారా సమస్యలకు పరిష్కారం లభించదని, శాంతి, సామరస్యాల ద్వారానే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ మాట్లాడుతూ చిన్నారుల్లో దయ, కరుణ, మానవతా విలువలను బాల్యం నుంచే పెంపొందిస్తే వారు సమాజానికి ఆదర్శ పౌరులుగా మారుతారని అన్నారు. ఇతర వక్తలు కూడా శాంతి, దయ, కరుణ వంటి విలువలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపులో ముఖ్య కార్యనిర్వాహక అధికారి యశస్వి విద్యార్థులందరితో ప్రపంచ శాంతి కోసం ప్రతిజ్ఞ చేయించారు.

**8 వేల మంది విద్యార్థుల యోగా విన్యాసాలు**
**ఆసియా, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం**




రికార్డు సర్టిఫికేట్‌ను అందుకుంటున్న చైర్మన్ మల్కా కొమరయ్య



విద్యార్థుల యోగా విన్యాసాలు

## ఘనంగా హరిహర క్షేత్రం వార్షికోత్సవ వేడుకలు



దేవాలయంలో కళ్యాణాన్ని నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు మంగళగిరి శ్రీనివాసాచార్యులు, కాసుల చంద్రశేఖర్ శర్మ తదితరులు

**మలక్ పేట, జూలై 4, ప్రభాతవార్త:**
మలక్ పేట లోని శ్రీ హరిహర క్షేత్రం ఆలయ 67వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవాలయం వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలోని మూల విరాట్టులకు అభిషేకాలు, ఉపనిషత్ పారాయణాలు, శివకేశవుల కళ్యాణ మహోత్సవం, సంకటహర గణపతి అభిషేకం, అర్చన అనంతరం శ్రీ ఉమామహేశ్వర స్వామి సహిత వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో తిలకించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ట్రస్ట్ చైర్మన్ సుగురు రమేష్, ఆలయ ఇఓ మార్తాండ రావు, కమిటీ సభ్యులు శెట్టి విజయకుమార్, సరాపు శ్రీహరి, వనం సత్యేందర్, రొడ్డ రమేష్, రేణు అగర్వాల్, పారిజాత రెడ్డి, ఆలయ అర్చకులు కాసుల చంద్రశేఖర్ శర్మ, మంగళూరు శ్రీనివాసచార్యులు, మధు శర్మ పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సర్ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు రామచంద్ర గౌడ్

**కుషాయిగూడ, జూలై 4, ప్రభాతవార్త...**
అత్యంత ముఖ్యమైన సర్ కార్యక్రమాన్ని పట్ల అవగాహన కలిగించుకొని సర్ను సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చల్లపల్లి డివిజన్ కాంట్రిస్టర్ టిడిపి కార్పోరేటర్ రుద్ర గాని రామచంద్ర గౌడ్ పేర్కొన్నారు.. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన సర్ కార్యక్రమంలో భాగంగా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి డివిజన్ పరిధిలో నిర్వహించిన సర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ అశ్విన్ రాజు శ్రీలత మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు



నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులతో పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జూలై 3 ప్రభాతవార్త :** పార్టీ కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఉంటుందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ సర్కిల్‌లో నూతనంగా ఎన్నికైన రామంతాపూర్, వెంకట్‌రెడ్డినగర్, హబ్సిగూడ డివిజన్ అధ్యక్షులు నామ్‌రాజిరెడ్డి, సందీప్, కంది శ్రవణ్‌కుమార్‌రెడ్డిలను ఆయన ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలల్లోకి తీసుకెళ్లి విస్తృత్తంగా ప్రచారం చేయాలని సూచించారు.పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కొత్త డివిజన్ అధ్యక్షులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఆకారపు అరుణ్, విజయ్‌కుమార్, బాలయ్య, వల్లపు శ్రీకాంత్ యాదవ్, ధర్మ, గుండు రాజు, భాస్కర్ పాల్గొన్నారు.

## చిలుకానగర్‌లో స్వామి వివేకానంద వర్ధంతి



స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఈరెల్లి రవీందర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జూలై 3 ప్రభాతవార్త :** చిలుకానగర్ చౌరస్తాలో స్వామి వివేకానంద 124వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిలుకానగర్ స్వామి వివేకానంద యూత్ అధ్యక్షులు ఈరెల్లి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత జాతి గర్వించదగ్గ మహనీయుడు, యువతకు చిరస్థాయి స్ఫూర్తి ప్రదాత, స్వామి వివేకా నంద అని కొనియడారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద యూత్ సభ్యులు ముఖ్య సలహాదారులు ముక్కల రామకృష్ణ, చైర్మన్ కటకం సంజయ్, వ్యవస్థాపకులు ఠాకూర్ ఉమేష్ సింగ్, ప్రధాన కార్యదర్శి ఇంద్రాల రమేష్, మాజీ అధ్యక్షులు ముక్కాల హరికృష్ణ ముదిరాజ్, ముశ్యం జయ చందర్, సకినాల ప్రసాద్, చిలువేరు సత్యనారాయణ, విశ్వనాధ్, శరత్, అఖిల్, నాని, మల్లేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య చిరస్మరణీయుడు: సిద్దాల దశరథ



దొడ్డి కొమురయ్యకు నివాళులర్పిస్తున్న రంగారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు సిద్దాల దశరథ

**సరూర్‌నగర్, జూలై 4 ప్రభాతవార్త:** ఆనాడు బాంచెన్ దొర నీ కాల్మొక్కుతానన్న బడుగు, బలహీన వర్గాల వారిలో చైతన్యాన్ని నింపి నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్ల అకృత్యాలకు, దొరల అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య చిరస్మరణీయుడని రంగారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు, జిల్లెలగూడ మాజీ ఎంపిటిసి సభ్యుడు సిద్దాల దశరథ అన్నారు. బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ కిందకు వచ్చిన జిల్లెలగూడ/మీర్‌పేట్‌లోని సిద్దాల దశరథ కాంప్లెక్స్‌లో శనివారం దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథ కురుమ సంఘం నాయకులతో కలిసి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాడు కొమురయ్య ఆనాడు చేసిన పోరాటం చారిత్రాత్మకమైందని అన్నారు. అన్యాయాలకు వ్యతిరేకంగా కొమురయ్య చూపిన తెగువ, ధైర్యం స్ఫూర్తిదాయకమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరింటి వెంకటేశ్ కురుమ, చినింగి బాలప్ప, అచ్చిని యాదగిరి, చినింగి రమేష్, ప్యాట నర్సింహ, నారి సత్యనారాయణ, కాట్నే పద్మ, సిద్దాల శ్రీశైలం, సిద్దాల జగదీశ్, ఎస్. నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ సమర్థవంతంగా జరిగేలా చర్యలు: డిసి సమ్మయ్య



ఓటర్లకు సర్‌పై అవగాహన కల్పిస్తున్న బడంగ్‌పేట్ డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య

**సరూర్‌నగర్, జూలై 4 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ సర్కిల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలను సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ కమీషనర్ వి.సమ్మయ్య స్పష్టం చేశారు. శనివారం ఆయన సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేసి ఎలా పూరించాలో వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించే క్రమంలో సర్కిల్ పరిధిలోని బిఎల్‌ఎలకు ఆదివారం బడంగ్‌పేట్ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్‌కు సంబంధించి ఎన్యూమరేషన్ ఫారాలు నింపే విధానంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అదే విధంగా 2002 నాటి ఎస్ఐఆర్ వివరాలు వెబ్ పోర్టల్‌లో ఏ విధంగా శోధించాలో తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. సర్ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించడానికి గాను బడంగ్‌పేట్ సర్కిల్‌లోని పెద్ద చెరువు, మంత్రాలు చెరువు, చందన చెరువు, బడంగ్‌పేట్ మున్సిపల్ మైదానం తదితర ప్రాంతాల్లో ప్రతి రోజు ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు రెండు గంటల పాటు హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామని సమ్మయ్య తెలిపారు.

## 'సర్' పారదర్శకంగా, సమర్థవంతంగా ఉండాలి

**: రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి**



అధికారులకు సూచనలు చేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

**సైదాబాద్, జులై 4 ప్రభాతవార్త:** ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా ఉండాలని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి సూచించారు. చంపాపేట డివిజన్ మారుతీనగర్ లైబ్రరీలో కొనసాగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియను డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డితో కలసి ఆయన పరిశీలించి బిఎల్‌ఏలు, బిఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చూడాలని, అనర్హుల పేర్లు తొలగించాలని సూచించారు. ఓటు హక్కుపై ప్రజల్లో విస్తృత అవగాహన కలిగిస్తూ ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు నమోదును విజయవంతం చేయాలన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, అర్హులైన వారందరు ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గణేష్ నాయక్, జైపాల్‌రెడ్డి, నాయకులు కారుకొండ శివ, రఘు, రఘునందన్‌రెడ్డి, అబ్దుల్లా, బాలకృష్ణ, సురేష్, రణధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్‌లో దొడ్డి కొమురయ్య వర్ధంతి



**సరూర్‌నగర్, జూలై 4 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ సర్కిల్ బాలాపూర్ డివిజన్‌లోని బాలాపూర్ గ్రామంలోనున్న కురుమ సంఘం భవనంలో శనివారం దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. కురుమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా బాలాపూర్ మండల కురుమ సంఘం అధ్యక్షుడు ఇక్కె సత్యనారాయణ కురుమ, నాయకులు జోరల ప్రభాకర్ తదితరులు కొమురయ్య చిత్రపటానికి పుష్పాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, రావుల మల్లేష్, ఇక్కె కొండల్, గుండ్ల కొమురయ్య, గొరిగె శ్రీశైలం, సత్తయ్య, రావుల మహేందర్, శ్రీకాంత్, కిరణ్, బల్వంత్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



సైదాబాద్‌లో స్వామి వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి